సాక్షి
కర్నూలు
శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



టమాట ధర మరింత పతనం

మార్కెట్‌లో టమాట ధర మరింత పతనం అయ్యింది. గత కొద్ది రోజులుగా ధర నిలకడగా ఉండటం లేదు. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. 10లో▸



అవిశ్వాస తీర్మానానికి వినతి

ఆదోని ఎంపీపీపై అవిశ్వాసానికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు సిద్ధమయ్యారు. ఈ మేరకు గురువారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 10,728
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 10,574

న్యూస్‌రీల్

మహిళా ఉద్యోగుల సమస్యలకు సత్వర పరిష్కారం



జిల్లా కలెక్టర్ ఎ.సిరిని మర్యాదపూర్వకంగా కలసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తెలిపారు. గురువారం సాయంత్రం ఏపీఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ నేతలు జిల్లా కలెక్టర్‌ను ఆమె చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను, ముఖ్యంగా మహిళా ఉద్యోగుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అన్ని శాఖల్లో మహిళా ఉద్యోగులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి స్పందిస్తూ ఉద్యోగుల అభ్యున్నతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి, కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా అసోషియేట్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, మహిళ విభాగం నేతలు పాల్గొన్నారు.

సెలవులో వెళ్లిన జిల్లా ట్రెజరీ అధికారి

- ఏటీవో సుబ్బరాయుడుకు పూర్తి అదనపు బాధ్యతలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు అనారోగ్య కారణాలతో ఈ నెల 19 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు సెలవులో వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇదే కార్యాలయంలో అసిస్టెంట్ ట్రెజరీ అధికారి(ఏటీవో)గా పనిచేస్తున్న సుబ్బరాయుడును పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా ట్రెజరీ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు బాధ్యతలు స్వీకరించిన సుబ్బరాయుడును ఏపీటీఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు డి.రవికుమార్, సెక్రటరీ గురుమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీధర్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి జడ్.కరుణాకర్ పలువురు ట్రెజరీ ఉద్యోగులు అభినందించారు.

తప్పుడు స్టాంపు డ్యూటీ సొమ్ము రూ.20.26 లక్షల రికవరీ

- అప్పటి సబ్ రిజిస్ట్రార్ రాజశేఖర్‌పై క్రమశిక్షణా చర్యలు

కర్నూలు(సెంట్రల్): ఆస్తి విలువను తక్కువగా చూపి రూ.20.26 లక్షల స్టాంపు డ్యూటీ మినహాయింపుపై లోకాయుక్త ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది క్షమించరాని నేరమని, బాధ్యతాయుత హోదాలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ అలా చేయడంతో అతనికి మూడు సంవత్సరాలపాటు ఇంక్రిమెంట్లను నిలుపుదల చేయడంతోపాటు రూ.20.26 లక్షలను బాధిత పార్టీల నుంచి ఖజానాకు జమ చేసేలా చర్యలు చేపట్టింది. 2023లో అప్పటి ఆదోని సబ్ రిజిస్ట్రార్ రాజశేఖర్ డాక్యుమెంట్ నంబర్ 5352/2023 రిజిస్ట్రేషన్‌కు తక్కువ స్టాంపు డ్యూటీ నమోదు చేసి ఖజానాకు రూ.20.26 లక్షలు ఆర్థిక నష్టం కలిగించారని లోకాయుక్తకు ఫిర్యాదు రావడంతో ఉప లోకాయుక్త స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కర్నూలు డీఐజీని విచారణకు ఆదేశించారు. విచారణలో నేరం రుజువు కావడంతో బాధిత పార్టీల నుంచి రూ.20,26,200 వసూలు చేయడమే కాకుండా సబ్ రిజిస్ట్రార్ రాజశేఖర్‌పై క్రమశిక్షణా చర్యల కింద మూడు సంవత్సరాల పాటు ఇంక్రిమెంట్ల కోత విధిస్తూ లోకాయుక్తకు గురువారం నివేదిక సమర్పించారు. పరిశీలించిన ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజనీ కేసును మూసివేశారు.

హాస్టళ్ల బిల్లులు అప్‌లోడ్ చేయించండి



ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సీహెచ్ మనోహర్‌తో మాట్లాడుతున్న డీడీ రాధిక

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తయిన పనుల బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి బి.రాధిక కోరారు. ఈ మేరకు ఆమె గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజనీరు సీహెచ్ మనోహర్‌ను కలిసి బిల్లుల విషయమై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 25 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో రూ.7,89,99,000లతో పలు రకాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే చాలా పనులు దాదాపు పూర్తయ్యే దశకు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో చేసిన పనులకు బిల్లులను ఆయా శాఖలు అప్‌లోడ్ త్వరితగతిన బిల్లులు విడుదలయ్యే అవకాశం ఉంటుందన్నారు.



మురహరిరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు బుట్టారేణుక, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు



కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంపుల్లయ్య యాదవ్, నరసింహులు యాదవ్‌లను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కూటమికి బిగ్ షాక్

- మాజీ సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ నేత కె.ఆర్.మురహరిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరు నియోజకవర్గ బీజేపీ నేత కె.ఆర్.మురహరిరెడ్డి ఆ పార్టీని వీడి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే కేఆర్ హనుమంతరెడ్డి అన్న మహానందిరెడ్డి మనవడైన కె.ఆర్.మురహరిరెడ్డి వ్యాపారవేత్తగా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు చేరువయ్యారు. వైఎస్సార్‌సీపీలో ఈయన చేరికతో నియోజకవర్గంలో కూటమికి బిగ్ షాక్ తగిలినట్లయింది. వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు కిరణ్ కుమార్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి, చేనేత నాయకుడు మల్లికార్జున, మాజీ కౌన్సిలర్ మధుబాబులు ఆయా పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, నియోజకవర్గ పరిశీలకుడు తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి కర్నూలు కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(టౌన్): కర్నూలు నగరానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కర్నూలు పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, నగర అధ్యక్షులు అహమ్మద్ అలీఖాన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కేడీసీసీ మాజీ డైరెక్టర్, ఉమ్మడి జిల్లా గొర్రెల సహకార సంఘం మాజీ చైర్మన్ రాంపుల్లయ్య యాదవ్, మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు నరసింహులు యాదవ్, బంధువులు, అనుచరులతో కలిసి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వీరందరికీ మాజీ సీఎం పార్టీ కండువాలు కప్పి అభినందించారు.

గౌరవ వేతనం.. కహా భయ్యా!

- ఇమామ్, మౌజన్లపై పెదవి విప్పని కూటమి ప్రభుత్వం
- ఈ ఏడాది జనవరి నుంచి పెండింగ్‌లో గౌరవ వేతనం
- పేరుకుపోయిన రూ.10.77 కోట్ల బకాయిలు
- మసీదుల నిర్వహణకు విడుదల కాని నిధులు
- నెలకు రూ.5 వేల ప్రకారం రూ.5.98 కోట్లకు చేరుకున్న నిర్వహణ భారం



కర్నూలు(అర్బన్): ముస్లింలకు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలేని పరిస్థితి నెలకొనింది. మసీదుల్లో నమాజు చదివే ఇమామ్, మసీదుల్లో వివిధ పనులను చేసే మౌజన్లకు గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని మ్యానిఫెస్టోలో కూడా పొందుపరిచారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని మరచిపోయారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని వందల సంఖ్యలో ఇమామ్, మౌజన్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

హామీ ఇచ్చారు ఇలా..

ఎలాంటి ఆదాయ వనరులు లేని చిన్న మసీదులపై ఆధారపడి జీవనం సాగించే ఇమామ్, మౌజన్లకు ప్రతి నెలా గౌరవ వేతనం ఇవ్వాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. ప్రతి నెలా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలను విడుదల చేస్తూ వచ్చారు. గతేడాది మార్చి వరకు ఇబ్బంది లేకుండా ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేలు విడుదల చేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గౌరవ వేతనం అందించలేని పరిస్థితి నెలకొనింది. ఎన్నికల సమయంలో జరిగిన పలు బహిరంగ సభల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని, ఇమామ్, మౌజన్లకు ప్రతి నెలా క్రమం తప్పకుండా గౌరవ వేతనాలను అందిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఇమామ్, మౌజన్లకు అరకొరగా నిధులు విడుదల చేయగా, ఈ ఏడాది జనవరి నుంచి (దాదాపు 9 నెలలు) గౌరవ వేతనాలకు నయాపైసా విడుదల చేయలేదని ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అదే దారిలో మసీదుల నిర్వహణ

ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనంతో పాటు మసీదుల నిర్వహణకు నెలకు రూ.5 వేలను విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం నమ్మబలికింది. అయితే ఈ హామీని కూడా అమలు చేయకపోవడంతో మసీదుల నిర్వహణ భారం కూడా రూ. 5.98 కోట్లకు చేరుకుంది. మొత్తం 798 మసీదులకు నెలకు రూ.5 వేల ప్రకారం నెలకు రూ.39,90,000లు కాగా.. తొమ్మిది నెలలకు రూ.5,98,50,000లకు చేరుకుంది. మసీదుల నిర్వహణకు ప్రభుత్వం విడుదల చేస్తామన్న నిధులు ఏ నెలకు ఆ నెల విడుదల చేస్తే విద్యుత్ బిల్లులు, ఇతరత్రా చిన్న చిన్న ఖర్చులకు ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఉండవనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

పేరుకుపోయిన రూ.10.77 కోట్ల బకాయిలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 798 చిన్న, పెద్ద మసీదులు ఉన్నాయి. ఒక్కో మసీదులో ఒక ఇమామ్, ఒక మౌజన్ ప్రకారం అల్లా సేవలో నిమగ్నమై విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అందించాల్సిన గౌరవ వేతనాలకు సంబంధించి ఒక్కో మసీదుకు (ఇమామ్‌కు రూ.10 వేలు, మౌజన్‌కు రూ. 5 వేల ప్రకారం) రూ.15 వేల ప్రకారం నెలకు రూ.1,19,70,000లను చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన ఈ ఏడాది జనవరి నుంచి (తొమ్మిది నెలలకు) ఇప్పటి వరకు రూ.10,77,30,000లను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. దీంతో ఎలాంటి ఆదాయ వనరులు లేని చిన్న మసీదుల్లోని ఇమామ్, మౌజన్లు తీవ్ర ఆర్థిక పరిస్థితులకు గురవుతున్నారు. కేవలం ప్రభుత్వం విడుదల చేసే గౌరవ వేతనంపై ఆధారపడిన ఇమామ్, మౌజన్ల కుటుంబాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో వందల సంఖ్యలోనే ఉన్నాయి.

కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న మత పెద్దలు

సమాజాన్ని శాంతి మార్గంలో నడిపే మత పెద్దల సంక్షేమాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విస్మరించడంపై ఆయా వర్గాలు మండి పడుతున్నాయి. ఇమామ్, మౌజన్లకు పెండింగ్‌లో ఉంచిన గౌరవ వేతనాలతో పాటు మసీదుల నిర్వహణకు ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

మైనార్టీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మైనార్టీలను పూర్తిగా విస్మరిస్తోంది. ఇమామ్, మౌజన్లకు విడుదల చేయాల్సిన గౌరవ వేతనాన్ని తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉంచింది. ప్రతి మసీదుకు రూ. లక్ష నగదుతో పాటు ప్రతి నెలా మసీదు నిర్వహణకు రూ.5 వేల ఇస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదు. మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని చెప్పినా, నేటి వరకు అమలుకు నోచుకోలేదు.

– షరీఫ్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గౌరవ వేతనాలు ఇచ్చేందుకు చేతులు రావడం లేదు



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలను విడుదల చేసేందుకు చేతులు రావడం లేదు. ముస్లిం, క్రిస్టియన్లకు సూపర్ 10 అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆయా వర్గాలకు ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. ముస్లిం, క్రిస్టియన్ వర్గాలపై ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్టాన్ని బలపరిచేది కాదు.

– పీ ఇక్బాల్‌హుసేన్, ఆవాజ్ నగర కమిటీ అధ్యక్షుడు

ఒక్క హామీని నెరవేర్చడం లేదు



రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చడం లేదు. ఈద్గాలు, ఖబరస్థాన్‌లకు స్థలాలు కేటాయిస్తామన్నారు. ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇమామ్, మౌజన్లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలి. అర్హత ఉన్న ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమించాలి.

– ఎస్ఎండీ షరీఫ్, ఆవాజ్ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి

శనగ విత్తనాలు అందించడంలో ప్రభుత్వం విఫలం

- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి: రబీ సీజన్ ప్రారంభంకావొస్తున్నా నేటికీ రైతులకు పప్పుశనగ విత్తనాలను సబ్సిడీలో అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమయ్యిందని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు శనగ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. హాలహర్వి, చిప్పగిరి మండలాల్లో ఎక్కువగా పప్పుశనగను సాగు చేస్తారన్నారు. గత వైఎస్సార్సీపీ హయాంలో సెప్టెంబర్ చివరి వారానికే సబ్సిడీ శనగ విత్తనాలు రైతులకు అందేవన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను విస్మరిస్తోందన్నారు. సకాలంలో సబ్సిడీ శనగ విత్తనాలను అందించని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

27న అంతర్జాతీయ బధిరుల దినోత్సవం

కర్నూలు(అర్బన్): అంతర్జాతీయ బధిరుల దినోత్సవాన్ని ఈ నెల 27న ఉదయం 10 గంటలకు స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని బధిరుల సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, బ్యాంకు తదితర శాఖలకు చెందిన ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు. బధిర ప్రభుత్వ ఉద్యోగులకు ఓడీ సౌకర్యం ఉందనే విషయాన్ని తమ అధికారులకు తెలియజేసి కార్యక్రమంలో పాల్గొనాలని ఏడీ పేర్కొన్నారు.

‘కన్నీళ్లు’ తుడిచేదెప్పుడు!

‘మద్దతు’ వ్యత్యాసం మరిచిన ప్రభుత్వం

- 3,700 మంది రైతులకు మొండిచేయి
- 69,320 క్వింటాళ్లు రైతుల నుంచి నేరుగా కొన్న మార్క్‌ఫెడ్
- ఇప్పటి వరకు 14,491 క్వింటాళ్లకు మాత్రమే రూ.1.54 కోట్ల చెల్లింపులు
- పది రోజులుగా మార్క్‌ఫెడ్ చుట్టూ రైతుల ప్రదక్షిణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో కూటమి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో ఉల్లిగడ్డలు అమ్ముకున్న రైతులకు నగదు చెల్లింపులు ఇప్పటికీ అందని పరిస్థితి. 20 రోజులు గడుస్తున్నా చెల్లింపులు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రైతులకు వారం, పది రోజుల్లో నేరుగా బ్యాంకు ఖాతాలకు నగదు విడుదలవుతుందని అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో బాధిత రైతులు మార్క్‌ఫెడ్‌తో పాటు మార్కెటింగ్ శాఖ అధికారుల చుట్టు ప్రదక్షిణ చేస్తున్నారు. ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు రైతుల నుంచి మద్దతు ధర రూ.1,200తో నేరుగా కొనుగోలు చేశారు. ఆ తర్వాత నుంచి వ్యాపారులు కొన్న ధర మినహాయించి బ్యాలెన్స్ అమౌంటు నేరుగా రైతుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. 20వ తేదీ వరకు మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ఉల్లి కొనుగోలు చేసింది. ఆర్థిక బారం తగ్గించుకునేందుకు కూటమి ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోళ్లకు మంగళం పలికి హెక్టారుకు రూ.50 వేల పరిహారం చెల్లిస్తామని ప్రకటించి చేతులు దులిపేసుకుంది.

మద్దతు చెల్లింపులు 250 మందికే..

మార్క్‌ఫెడ్ నేరుగా 1,200 మంది రైతుల నుంచి 69,320 క్వింటాళ్లు మద్దతు ధర రూ.1,200తో కొనుగోలు చేసింది. మరో 2,500 మంది రైతుల నుంచి వ్యాపారులు 90,917 క్వింటాళ్లు కొన్నారు. మద్దతు ధర రూ.1,200 నుంచి వ్యాపారులు కొన్న ధరను మినహాయించి వ్యత్యాసం మొత్తాన్ని మార్క్‌ఫెడ్ రైతులకు చెల్లించాల్సి ఉంది. అయితే 3700 మంది రైతులు మద్దతు ధరతో ఉల్లి గడ్డలు అమ్ముకుంటే ఈ నెల 15వ తేదీ నాటికి కేవలం 250 మంది రైతులకు సంబంధించి 14,491.02 క్వింటాళ్లకు రూ.1,54,35,360 చెల్లింపులు చేయడం గమనార్హం.

వ్యత్యాసం డబ్బు జమ కాలేదు



రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. ఈ నెల 8న కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 118 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు అమ్మకానికి తీసుకొస్తే వ్యాపారులు క్వింటా రూ.204 ప్రకారం కొన్నారు. మద్దతు ధరలో వ్యత్యాసం రూ.996 ప్రకారం రూ.1,17,528 బ్యాంకు ఖాతాకు విడుదలవుతుందని చెప్పారు. ఈ నెల 5వ తేదీ వరకు బ్యాంకు ఖాతాకు వ్యత్యాసం మొత్తం జమ కాలేదు. రోజూ బ్యాంకుకు వెళ్లి చెక్ చేసుకోవడంతో సరిపోతుంది.

– బి.రామలింగడు, దైవందిన్నె, ఎమ్మిగనూరు మండలం

క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ



మాట్లాడుతున్న ఏఓ అమీరున్నీసా బేగం

కొత్తపల్లి: సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ సాధ్యమని యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, రవిగౌడ్ అన్నారు. గురువారం వారు నందికుంట గ్రామ సమీపంలోని వరిపొలాలను పరిశీలించారు. అనంతరం స్థానిక వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తి దారుల సంఘం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాతావరణం చల్లగా ఉండడంతో తెగుళ్ల సోకే అకాశం ఎక్కువగా ఉందన్నారు. రైతులు భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం చేపట్టి సాగు ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అమీరున్నీసా బేగం, ఏపీఎమ్ పుల్లయ్య, వెలుగు సీసీలు నరసింహులు, రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ పునఃమూల్యాంకనం ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మే/జూన్ నెలల్లో జరిగిన డిగ్రీ రెండు, నాల్గవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల పునఃమూల్యాంకనం ఫలితాలను విడుదల చేశారు. వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసరావు ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రెండో సెమిస్టర్‌కు సంబంధించి 541 మంది రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా 151 మంది, నాల్గవ సెమిస్టర్‌కు 781 మందికి 196 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in లో అందుబాటులో ఉన్నాయన్నారు.

మద్యం తాగొద్దని మందలించడంతో..

గోస్పాడు: మద్యం తాగొద్దని భార్య మందలించడంతో ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన హుసేని(73) రోజూ మద్యం సేవించి భార్య సాలమ్మతో ఘర్షణ పడుతుండేవాడు. బుధవారం కూడా మద్యం సేవించడంతో భార్య మందలించింది. బయటకు వెళ్లిన హుసేని రాత్రి పొద్దుపోయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామ సమీపంలో వెతుకుతుండగా అపస్మారక స్థితిలో కనిపించాడు. పురుగు మందు తాగినట్లు గుర్తించి నంద్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యు లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

బాషా, రక్ష ఆసుపత్రులపై కేసులు నమోదు చేయండి

కర్నూలు (సెంట్రల్): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న కోడుమూరు బాషా, కర్నూలు రక్ష ఆసుపత్రులపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ (పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్) సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశానికి 6వ అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి లక్ష్మీరాజ్యం, డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, సీఐ తబ్రేజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ మరణానికి కారణమైన రక్ష ఆసుపత్రిపై కేసు నమోదు చేసి సీజ్ చేయాలని ఆదేశించారు. ఇకపై జిల్లాలో ఎక్కడ కూడా లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ ప్రతినిధులు డాక్టర్ బాలమద్దయ్య, నోడల్ ఆఫీసర్ నాగప్రసాద్ బాబు, ప్రోగ్రాం కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

టమాట ధర మరింత పతనం



పత్తికొండ మార్కెట్‌కు తీసుకొచ్చిన టమాట

పత్తికొండ/ప్యాపిలి: మార్కెట్‌లో టమాట ధర మరింత పతనం అయ్యింది. గత కొద్ది రోజులుగా నిలకడగా ఉండటం లేదు. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. గురువారం పత్తికొండ పట్టణంలోని మార్కెట్‌లో టమాట ధర కిలో రూ.2 నుంచి గరిష్ఠంగా రూ.4 మాత్రమే పలికింది. మార్కెట్‌లో ధర తగ్గినప్పుడు కూటమి ప్రభుత్వం కిలో 8 రూపాయలకు కొనుగోలు చేస్తామన్న హామీ ఇచ్చినా క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పత్తికొండ మార్కెట్‌యార్డులో గురువారం టమాట 25కేజీల జత గంపలు కేవలం రూ.150 నుంచి రూ.250లోపు ధర పలికింది. వ్యాపారులు కమీషన్ పట్టుకోని ఇవ్వడంతో కేజీ రూ.2 నుంచి రూ. 4 మాత్రమే వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో 421 క్వింటాల టమాటను వ్యాపారులు కొనుగోలు చేశారు. దాదాపు 10 లారీల సరకు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. మూడో రోజు కూడా పూర్తిగా ధరలు తగ్గిపోవడంతో ఈఏడాది టమాట పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రాక మమ్ముల్ని అప్పుల్లో ముంచేస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. .

ప్యాపిలిలో..

ప్యాపిలి మార్కెట్‌లో రెండు రోజుల క్రితం 25 కిలోల బాక్స్ రూ. 650 వరకు పలికింది. గురువారం మాత్రం 25 కిలోల బాక్స్ ధర రూ. 50 పలికింది. కిలో రెండు రూపాయలకు పలకడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిలువునా ముంచుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తనకేమీ పట్టనట్లు చోద్యం చూస్తోందని మండిపడ్డారు.

ఆదోని ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి వినతి



సబ్‌కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం లేఖను అందజేస్తున్న ఎంపీటీసీలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి

ఆదోని రూరల్/ఆదోని టౌన్: ఆదోని ఎంపీపీపై అవిశ్వాసానికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు సిద్ధమయ్యారు. ఈ మేరకు గురువారం మండలంలోని 20 మంది వైఎస్సార్‌సీపీ చెందిన ఎంపీటీసీలు ఏకమై ఎంపీపీపై అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచి వేరే పార్టీలో చేరడంతోనే ఎంపీపీ దానమ్మపై అవిశ్వాస తీర్మానం పెట్టినట్లు తెలిపారు. దానమ్మ పార్టీకి నమ్మకద్రోహం చేసిందని, అందువల్లనే ఆమెను ఎంపీపీ పదవి నుంచి దించాలన్న ఉద్దేశంతోనే తాము ఈ అవిశ్వాస తీర్మానాన్ని పెట్టినట్లు చెప్పారు. స్పందించిన సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ మాట్లాడుతూ.. ఎంపీటీసీల వినతి మేరకు 15 రోజుల్లో నోటీసు జారీ చేస్తామన్నారు. అవిశ్వాస తీర్మానంలో ప్రస్తుత ఎంపీపీగా ఉన్న దానమ్మ నెగ్గితే కొనసాగుతారని, లేనిపక్షంలో తదుపరి ఎంపీపీ ఎన్నిక జరుగుతుందన్నారు.

పార్టీకి నమ్మకద్రోహం

వైఎస్సార్‌సీపీ తరఫున కపటి గ్రామ ఎంపీటీసీగా ఏకగ్రీవంగా గెలుపొందిన దానమ్మను అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఆదోని మండలంలో మొత్తం 29 మంది ఎంపీటీసీ స్థానాలు ఉండగా మండిగిరి-1, 2, సాదాపురం స్థానాల్లో ఎన్నికలు జరగలేదు. 26 స్థానాల్లో మాత్రమే ఎన్నికలు జరిగాయి. ఇందులో ముగ్గురు మృతి చెందగా, ఒకరు రాజీనామా చేశారు. అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు కపటి గ్రామానికి చెందిన ఎంపీటీసీ దానమ్మ ఎంపీపీగా ఎన్నుకున్నారు.

కేసుల ఛేదన వేగవంతానికి చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: కేసుల ఛేదనను వేగవంతం చేసేందుకు ప్రతి పోలీస్ సబ్ డివిజన్‌కు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయడంతో పాటు నిందితులకు శిక్షలు పడేలా క్షేత్రస్థాయిలో పోలీసు అధికారులు పనిచేయాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి బేసిక్ పోలీసింగ్ పాటించాలని, జీరో ఎఫ్ఐఆర్, ఈ-ఎఫ్ఐఆర్, ఈ-సాక్ష యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. అర్హత ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 26వ తేదీ వరకు నాలుగు వారాల పాటు రోడ్డు భద్రతపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గస్తీ తిరిగేటప్పుడు మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ పరికరంతో అనుమానితుల వేలిముద్రలు సేకరించాలన్నారు. గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనపర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, వెంకటరామయ్య, భార్గవి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆర్‌యూ టీచింగ్ ఫ్యాకల్టీపై వేటు?

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో ఆరుగురి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కారణం వీరు వర్సిటీ అధికారులు నిర్వహించిన అకడమిక్ ఫర్‌ఫామెన్స్ రివ్యూకు హాజరు కాకపోవడమే. దీనికి హాజరైన 31 మంది టీచింగ్ ఫ్యాకల్టీ సర్వీసెసను 2025-2026 అకడమిక్ ఇయర్‌కు కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మిగతా వారి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఈ 31 మందికి సంబంధించి 110 జీవో ప్రకారం వీరి సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని ఆ సర్వీస్‌కు అనుగుణంగా జీతాలు పెంచి మరలా కొత్త ఆడర్ ఇవ్వడంతో గతంలో ఉన్న వీరి సర్వీస్ జీరో అవుతుందని రెగ్యులర్ సర్వీస్ పరిగణలోకి రాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరు మందిలో ముగ్గురు అకడమిక్ ఫర్‌ఫామెన్స్ రివ్యూపై కోర్టుకు వెళ్లారు. మరో ముగ్గురు గతంలోనే మినిమం టైం స్కేల్ పొంది విధుల్లో కొనసాగుతున్నారు. మేం న్యాయ స్థానం ద్వారానే టైం స్కేల్ పొందాం మరి రివ్యూకు హాజరు కావాల్సిన అవసరం లేదని అభిప్రాయ పడుతున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో మెజారిటీ వర్సిటీలు అకడమిక్ ఫర్‌ఫామెన్స్ రివ్యూను నిర్వహించకపోయినా ఆర్‌యూలో అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఫర్‌ఫామెన్స్ రివ్యూలో సబ్జెక్టుకు సంబంధం లేని వారు రివ్యూ చేసినట్లు తెలిసింది. లైఫ్ సైన్సెస్‌కు సంబంధించి మరో డిపార్ట్‌మెంట్‌లో రివ్యూ కొనసాగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై వర్సిటీ వి.వెంకట బసవరావును వివరణ కోరగా..' ప్రభుత్వ ఆదేశాల మేరకు అకడమిక్ ఫర్‌ఫామెన్స్ రివ్యూ నిర్వహించాం. రివ్యూకు హాజరైన వారందరినీ కంటిన్యూ చేస్తున్నాం. రాని వారిని మరలా రివ్యూకు రామ్మని చెబుతున్నాం. శుక్ర, శని వారం రివ్యూ నిర్వహిస్తాం. వర్సిటీలో విధులు నిర్వహించే అధికారుల ఆదేశాలు పాటించాలి కదా. బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ రెండు కోర్సులు రిలేటెడ్‌గా ఉంటాయి. ఈ విషయం సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్ కూడా చెప్పారు. గతం నుంచి వారు కొనసాగుతున్నారు. రివ్యూకు హాజరయ్యారు. కొనసాగిస్తున్నామని చెప్పారు.

నిండుకుండలా జీడీపీ

గోనెగండ్ల: మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి హంద్రీనదికి నీటి విడుదలను గురువారం ఉదయం నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో అధికారులు గత మూడు రోజుల నుంచి జీడీపీ నీటిని హంద్రీనదికి విడుదల చేశారు. గురువారం ఉదయం ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి వరద నీటి ప్రవాహం తగ్గడంతో క్రస్ట్ గేటును మూసివేశారు. పూర్తిస్థాయి సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం జీడీపీలో 4.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నేటి నుంచి డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ



డిజిటల్ రేషన్ కార్డులను చూపుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య, డీఎస్ఓ రాజారఘువీర్

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో నేటి నుంచి డిజిటల్ రేషన్ కార్డులను అక్టోబర్ 1వ తేదీ వరకు సచివాలయాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు జేసీ డాక్టర్ ఏ.సిరి తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో కొత్తగా వచ్చిన రేషన్ కార్డులను డీఎస్ఓ ఎం.రాజారఘువీర్‌తో కలసి పరిశీలించారు. జిల్లాలకు మొత్తం 6,68,944 కార్డులు వచ్చాయన్నారు. వీటిని సచివాలయాల్లో నేటి నుంచి, అక్టోబర్ 2వ తేదీ నుంచే రేషన్ షాపుల్లో వీటిని తీసుకోవచ్చని వినియోగదారులకు సూచించారు. ప్రజలు తమకు సమీపంలోని సచివాలయాలను సందర్శించి డిజిటల్ రేషన్ కార్డులను ఉచితంగా తీసుకోవచ్చన్నారు.

పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ఇవ్వాలి



సమస్యలపై పోరాడుతామని నినాదాలు చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలను విడుదల చేయాలని, నాలుగు డీఏలను ఇవ్వాలని, మధ్యంతర భృతి 30శాతం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ 257 సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివయ్య, రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో నంద్యాల మండలం ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికైన మండల అధ్యక్ష కార్యదర్శులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, శ్రీనివాసులు వ్యవహరించారు.

నూనె గింజల ఉత్పత్తి పెంపుపై దృష్టి సారించాలి



నూనెగింజలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మీ

ఎమ్మిగనూరురూరల్: నూనె గింజల ఉత్పత్తి పెంపుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి అన్నారు. గురువారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ నూనె గింజల అభివృద్ధి పథకంలో భాగంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి ఆధ్వర్యంలో రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మీ మాట్లాడుతూ.. భారతదేశం సంవత్సరానికి సగటున 16 మిలియన్ టన్నుల నూనె గింజలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుందన్నారు. దీతో లక్షల కోట్లు రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని, నూనె గింజల ఉత్పత్తి పెంపుతో దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిస్తుందన్నారు. ఎఫ్‌పీవోలకు నాణ్యమైన విత్తనాలను అందించి విత్తనోత్పత్తి పెంపుతోపాటు నూనె గింజల ఉత్పత్తి పెరగటానికి ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఎమ్మిగనూరు, గోనెగండ్ల ఏవోలు శివశంకర్, హేమలత, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత కర్నూలు

- బాలికల విభాగంలో అనంతపురం జట్టు
- ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు



మొదటి స్థానంలో నిలిచిన కర్నూలు బాలుర జట్టు



మొదటి స్థానంలో నిలిచిన అనంతపురం బాలికల జట్టు

ఎమ్మిగనూరుటౌన్: మూడు రోజులుగా ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. గురువారం ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో ద్వితీయ స్థానం శ్రీకాకుళం జట్టు, తృతీయ స్థానాన్ని అనంతపురం జిల్లా జట్టు దక్కించుకొంది. అదే విధంగా బాలిక పోటీల్లో మొదటి స్థానాన్ని అనంతపురం జట్టు, ద్వితీయ స్థానాన్ని విశాఖ పట్టణం జట్టు కైవసం చేసుకోగా తృతీయ స్థానం వెస్ట్ గోదావరి జిల్లా జట్టు దక్కించుకొంది. గెలుపొందిన ఆయా జట్లకు జిల్లా ఆర్‌ఐఓ లాలప్ప, మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రాఘవేంద్రాచారి, ఫుట్‌బాల్ అసోయేషన్ అధ్యక్షుడు రామకృష్ణ నాయుడు పాటు స్థానిక ప్రజాప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోటీల ఆర్గనైజర్లు వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహరాజు, హనీఫ్, శ్రీనివాసులు, సీజీ ఈరన్న ,శ్రీరాములు, లతీఫ్, వెంకటేష్, బసవరాజు, గంగాధర్‌తో పాటు పలువురు పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై కూష్మాండదుర్గ



శ్రీ కూష్మాండదుర్గగా కామేశ్వరిదేవి

మహానంది: మహానందిలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీకామేశ్వరిదేవి కూష్మాండదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అలంకార మండపంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, రుత్వికులు ముందుగా అమ్మవారికి విశేష అలంకార పూజలు, సహస్రదీపాలంకరణ పూజలు చేపట్టారు. బలిహరణ, కూష్మాండ బలి పూజల అనంతరం అమ్మవారిని సింహవాహనంపై కొలువు తీర్చి ఆలయ మాడవీధుల్లో ఉత్సవం చేపట్టగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వరరాజు, పి.సుబ్బారెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



సింహవాహనంపై కొలువై విహరిస్తున్న కూష్మాండదుర్గ

ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో మునిగి ఇంటర్ విద్యార్థి మృతి



మృతి చెందిన శ్రీనివాసులు

కర్నూలు: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణాన్ని బలి తీసుకుంది. కర్నూలు మండలం నూతనపల్లె గ్రామానికి చెందిన జయంతి, వెంకటేశ్వర్లు దంపతుల కుమారుడు శ్రీనివాసులు(17) కర్నూలు మండలం పసుపల-రుద్రవరం గ్రామాల మధ్య ఉన్న పొలంలోని బావిలో సరదాగా ఈత కొట్టేందుకు దిగాడు. సరిగ్గా ఈత రాకపోవడంతో మునిగి మృతిచెందాడు. తల్లి జయంతి దుబాయ్‌లో నర్సుగా పనిచేస్తుండగా తండ్రి వెంకటేశ్వర్లు కర్ణాటకలో పాలిష్ కట్టర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కొడుకు, కూతురు సంతానం. ఇద్దరు కూడా నాయనమ్మ దగ్గర ఉంటూ చదువుకుంటున్నారు. శ్రీనివాసులు పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు ఎదురుగా ఉన్న సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ ఇంటర్మీడియట్ హెచ్ఈసీ చదువుతున్నాడు. బుధవారం స్నేహితులు ఈదుర్ బాషా, గణేష్, నవీన్, చంద్రహాసలతో కలసి పసుపుల సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు చేరుకున్నారు. స్నేహితులందరూ నీటిలోకి దిగి ఈత కొడుతుండగా తనకు కూడా కొద్దిగా ఈత వచ్చని స్నేహితులకు చెప్పి వారితో సరదాగా గడిపేందుకు నీటిలోకి దిగి మునిగిపోయాడు. ఎంత సేపటికీ నీటిలో నుంచి తేలకపోవడంతో స్నేహితులు భయాందోళనకు లోనై పరిగెత్తుకుంటూ వెళ్లి కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని బావిలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు కర్నూలుకు చేరుకున్నారు. అయితే విద్యార్థి శ్రీనివాసులు పెదవులు, చెవుల వద్ద చాపలు కొరికిన గాట్లు ఉన్నాయి. వాటిని చూసి స్నేహితులే ఏదో చేశారని, అందుకే తన కుమారుడు మృతి చెందాడని తల్లి జయంతి అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

కేసీ కెనాల్‌లో ఇద్దరు విద్యార్థుల గల్లంతు



కేసీ కాలువలో గల్లంతైన ప్రశాంత్, వడ్డె అశోక్

నగరంలో ఈత కొట్టడానికి వెళ్లి స్వామిరెడ్డి నగర్ వద్ద (వినాయక ఘాట్ పైన) ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. బళ్లారి చౌరస్తా సమీపంలోని వాసవీ నగర్‌లో నివాసముంటున్న రాముడు కుమారుడు వడ్డె అశోక్ (13), సీతారామ నగర్‌కు చెందిన కొమ్ము శివన్న కుమారుడు కొమ్ము ప్రశాంత్ (12) ఏపీఎస్పీ క్యాంప్‌లో ఉన్న పాఠశాలలో ఒకరు 9, మరొకరు 7వ తరగతి చదువుతున్నారు. గురువారం మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇరువురూ ఈత కొట్టేందుకు స్వామిరెడ్డి నగర్ వద్దకు చేరుకుని కేసీ కెనాల్‌లోకి దిగారు. నీటి ఉధృతిలో మునిగి వారు కనిపించకపోవడంతో స్థానికులు కనుగొని పోలీసులకు సమాచారమిచ్చారు. 3వ పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల అడ్రస్సులు సేకరించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. అశోక్‌కు సంబంధించిన టీషర్టు, ప్రశాంత్‌కు సంబంధించిన చెప్పులను సంఘటనా స్థలంలో తల్లిదండ్రులు గుర్తించారు. దీంతో గల్లంతైన విద్యార్థుల కోసం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి కేసీ కెనాల్ వెంట జొహరాపురం వరకు ఇరువైపులా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. చీకటి పడటంతో చేసేదేమీ లేక పోలీసులు వెనుదిరిగి వచ్చారు.

బాల్య వివాహాలు చేస్తే శిక్ష తప్పదు



సదస్సులో మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: బాల్య వివాహాలు చేసిన వారికి, చేయించిన వారికి శిక్షలు తప్పవని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో గురువారం 'బాల్య వివాహ నిరోధక చట్టం'పై పురోహితులు, పాస్టర్లు, ప్రభుత్వ ఖాజీలు, దేవాలయ ఏఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు లీలా వెంకటశేషాద్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు జరిపించాలని ఎవరైనా మీ దగ్గరకు వస్తే సంబంధిత శాఖలకు, 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు కానీ సమాచారం ఇస్తే వెంటనే నిలుపుదల చేయిస్తామన్నారు. బాల్య వివాహాలు చేసినవారికి రెండు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఐసీడీఎస్ అధికారి శారద మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కమిటీలు ఉన్నాయని, బాల్య వివాహాలపై సమాచారం ఇస్తే వెంటనే ఆ వివాహాన్ని నిలుపుదల చేసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కంచుగంటల శ్యాం సుందర్, రవిచంద్రవర్మ, చైల్డ్ రైట్స్ ఎన్‌జీఓ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘానికి నేడు ఎన్నికలు



సమాలోచనలు చేస్తున్న రామసుబ్బయ్య ప్యానల్ సభ్యులు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ పెన్షనర్ల జిల్లా సంఘానికి శుక్రవారం ఎన్నికలు జరగనున్నాయి. రహస్య బ్యాలెట్ పేపర్ ద్వారా జరిగే ఈ ఎన్నికల్లో పుల్లారెడ్డి, రామసుబ్బయ్య ప్యానళ్లు పోటీలో ఉన్నాయి. పన్నెండు ఏళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో గెలుపే లక్ష్యంగా ప్రచారం సాగించారు. దాదాపు 3,400 మంది ఓటర్లు ఉన్న సంఘానికి ఎన్నికల అధికారులుగా పెదనగౌడ్, ప్రభాకర్, కిట్టప్పలు వ్యవహరించనున్నారు. శుక్రవారం ఉదయం 10కి ప్రారంభమయ్యే ఎన్నికలు సాయంత్రం 4గంటలకు ముగుస్తాయి. గంట వ్యవధిలోనే తుది ఫలితాలు వెలువరించి అధ్యక్ష కార్యదర్శులకు గెలుపు పత్రాలను అందజేయనున్నారు.

ప్రశాంతంగా నంద్యాల డయాసిస్ కమిటీ ఎన్నిక

- సెక్రటరీగా ప్రభుదాసు, ఉపాధ్యక్షుడిగా రాజేంద్రబాబు విజయం



సెక్రటరీ బైళ్ల ప్రభుదాసు



ఉపాధ్యక్షుడు రాజేంద్రబాబు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల అధ్యక్ష ఖండం డయాసిస్ కమిటీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని హోలీక్రాస్ కెథడ్రల్ చర్చికి ఎదురుగా ఉన్న డయాసిస్ కార్యాలయ ఆవరణలో బిషప్ సంతోష్ ప్రసన్నరావు ఆధ్వర్యంలో డయాసిస్ సెక్రటరీ, ఉపాధ్యక్షులకు హోరాహోరీగా ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా స్టాండ్లీ విలియం వ్యవహరించారు. ఉదయం 9గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 2 గంటకు ముగిసింది. అప్పటి నుంచి కౌంటింగ్ నిర్వహించారు. డయాసిస్ సెక్రటరీగా బైళ్ల ప్రభుదాసు 200 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే ఉపాధ్యక్షుడిగా రెవరెండ్ మేకల రాజేంద్రబాబు 300 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. అలాగే డయాసిస్ ట్రెజరర్‌గా పరిశుద్ధ మత్తయి ఆలయం డీనరీ చైర్మన్ నందం ఐజక్‌ను కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ కమిటీ మూడేళ్ల పాటు 2028 వరకు కొనసాగుతుందని బిషప్ వివరించారు. ఎన్నికైన అభ్యర్థులను ఆయా పాస్టరేట్ల కౌన్సిలర్లు, గురువులు పూలమాలలతోను ఘనంగా సత్కరించారు. నూతనంగా ఎన్నికైన డయాసిస్ సెక్రటరీ బైళ్ల ప్రభుదాస్, ఉపాధ్యక్షుడు మేకల రాజేంద్రబాబు మాట్లాడుతూ.. బిషప్ సంతోష్ ప్రసన్నరావు ఆధ్వర్యంలో నంద్యాల డయాసిస్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. డయాసిస్ ఎన్నికల సందర్భంగా మూడవ పట్టణ సీఐ కంబగిరిరాముడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.